

ఘాట్ రోడ్డుకు గ్రహణం!

- ఏళ్ల తరబడి అభివృద్ధి చేయని వైనం
- మరమ్మతులకు నోచుకోని రక్షణ గోడలు
- ఘాట్‌లో భద్రతపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- ఏవోబీ రవాణాకు ఘాట్ రోడ్డు కీలకం
- కార్యరూపం దాల్చని మరమ్మతుల ప్రతిపాదన
- కూటమి ప్రభుత్వం అభివృద్ధికి పెద్దపీట వేస్తుందనే ఆశలు

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

పాడేరు ఘాట్ రోడ్డు అభివృద్ధికి గ్రహణం పట్టింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీసం పట్టించుకోలేదు. చివరకు రక్షణ గోడల మరమ్మతుల కోసం పంపించిన ప్రతిపాదనలను బుట్టదాఖలు చేసింది. ఘాట్ రోడ్డు అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం పట్ల గిరిజనం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తోంది.

రక్షణ గోడలకు మరమ్మతుల ఊసే లేదు

జిల్లా కేంద్రం నుంచి మైదాన ప్రాంతానికి రాకపోకలు సాగించే పాడేరు ఘాట్ మార్గంలో రక్షణ గోడలు శిథిలస్థితికి చేరుకున్నాయి. గత ఐదేళ్లుగా అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఘాట్ రోడ్డు అభివృద్ధిపై దృష్టి సారించలేదు. వాస్తవానికి ఎక్కడైనా ఘాట్ రోడ్లకు రక్షణ గోడలే ప్రధాన ఆధారం. కనీసం రక్షణ గోడలకు మరమ్మతులపై దృష్టి కేంద్రీకరించలేదు. ఇన్నాళ్లు డివిజన్ కేంద్రంగా ఉన్న పాడేరు ప్రస్తుతం జిల్లా కేంద్రం కావడంతో ఘాట్ మార్గంలో రాకపోకలు రెట్టింపు అయ్యాయి.

పాడేరు నుంచి చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం ప్రాంతాలకు రాకపోకలు సాగించాలన్నా, ఆయా ప్రాంతాల నుంచి పాడేరుతో పాటు ఒడిశా రాష్ట్రానికి వెళ్లాలన్నా.. ఘాట్ ప్రయాణం తప్పనిసరి. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ఈ ఘాట్ మార్గంలో రక్షణపై వైసీపీ పాలకులు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ప్రధానంగా ఘాట్‌లోని వ్యూపాయింట్‌కు సమీపంలో, రాజాపురం వద్ద, ఏసుప్రభు బొమ్మ మలుపులకు అటూ, ఇటూ, వంట్లమామిడి నుంచి గరికిబంద వరకు ఉన్న మలుపుల్లో రక్షణ గోడలు శిథిలమైపోయాయి. వాహనాలు అదుపు తప్పితే లోయలోకి దూసుకుపోవాల్సిందే. గతంలో నిర్మించి రక్షణ గోడలు శిథిలం కాగా, చాలా ఏళ్లుగా కొత్త రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ఘాట్ ప్రయాణం రక్షణ రహితంగా ఉందని ఉందని డ్రైవర్లు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.



ఘాట్‌లో ప్రమాదకరమైన మలుపు వద్ద శిథిలమైన రక్షణ గోడ



పాడేరు ఘాట్ రోడ్డులో రక్షణ గోడ లేని పరిస్థితి

ఏవోబీ రవాణాకు ఘాట్ రోడ్డు కీలకం

స్థానిక ఘాట్ రోడ్డు కేవలం మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి రాకపోకలు సాగించేందుకే కాకుండా సరిహద్దున ఉన్న ఒడిశా రాష్ట్రానికి సంబంధించిన రవాణాకు కీలకమే. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి ఒడిశా రాష్ట్రం జైపూర్, కొరాపుట్ ప్రాంతాలకు వెళ్లే సరకు రవాణా వాహనాలు పాడేరు ఘాట్ మీదుగానే రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో స్థానిక ఘాట్ మార్గం వల్ల ఒడిశా రాష్ట్రానికి చాలా వరకు మేలు జరుగుతుంది. అలాగే ఇటీవల ఏజెన్సీ ప్రాంతానికి పర్యాటకులు పెరగడంతో ఘాట్‌లో రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. ఈతరుణంలో ఘాట్ రోడ్డు రక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కార్యరూపం దాల్చని మరమ్మతుల ప్రతిపాదన

స్థానిక ఘాట్ మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద ఐరన్ గడ్డర్లను ఏర్పాటు చేయాలని చాలా కాలంగా రోడ్ల, భవనాల శాఖాధికారులు ప్రతిపాదిస్తున్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. 2022లో అప్పటి ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ సైతం ఘాట్ మార్గంలో అవసరమైన చోట్ల మరమ్మతులు చేపట్టాలని రోడ్ల, భవనాల శాఖాధికారులను కోరారు. అందుకు రూ.8.5 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. నిధులు మంజూరైతే ఘాట్‌లోని ప్రమాదకరంగా ఉన్న మలుపులను సరిచేయడంతో పాటు లోయల్లోకి వాహనాలు అదుపు తప్పి ప్రమాదానికి గురికాకుండా పటిష్టమైన ఐరన్ గడ్డర్లను ఏర్పాటు చేయాలని భావించారు. కానీ రెండేళ్లయినా ఆ ప్రతిపాదనకు ప్రభుత్వ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో ఘాట్ మార్గం అభివృద్ధికి నోచుకోని దుస్థితి ఏర్పడింది.

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

అభివృద్ధికి పెద్దపీట వేసే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సాధారణ రోడ్లతో పాటు ఘాట్ రోడ్ల అభివృద్ధిపై దృష్టిసారిస్తుందని వాహన చోదకులు, ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే రోడ్లు, ఘాట్ మార్గాల అభివృద్ధి జరిగింది. దీంతో కొత్త ప్రభుత్వం పాడేరు, లంబసింగి, అనంతగిరి ఘాట్ మార్గాల అభివృద్ధికి చర్యలు చేపట్టి ప్రమాదాలను అరికట్టాలను పలువురు కోరుతున్నారు.

ఎస్పీ అమిత్ బర్దార్ బాధ్యతల స్వీకారం

గంజాయి సాగు, రవాణా నిర్మూలనకు చర్యలు



బాధ్యతలు స్వీకరించిన అమిత్‌బర్దార్

పాడేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా అమిత్‌బర్దార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి సాగు, రవాణా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడతామని ప్రకటించారు. గంజాయి శాశ్వత నిర్మూలన ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అవసరమైన ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. గిరిజనులు గంజాయిని వీడి ప్రత్యామ్నాయ పంటకు సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే గ్రామాల్లో గంజాయి సాగు, రవాణాను అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు చర్యలు చేపడతామన్నారు. మారుమూల గ్రామాల్లో ప్రజలకు పోలీసుల సేవలను చేరువ చేస్తామన్నారు. అంతకు ముందు అమిత్‌బర్దార్ మోదకొండమ్మను దర్శించుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకున్న అమిత్‌బర్దార్‌కు ఏఎస్పీ కె.ధీరజ్, పలువురు సీఐలు, ఎస్‌ఐలు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

సెల్‌ఫోన్ టార్చి వెలుగులో రోగులకు వైద్య సేవలు

- గోమంగి పీహెచ్‌సీలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం
- విద్యుత్ లేక పాడవుతున్న ఖరీదైన మందులు
- పలుమార్లు విన్నవించినా పట్టించుకోని ఏపీఈపీడీసీఎల్ అధికారులు



పీహెచ్‌సీలో సెల్‌ఫోన్ టార్చి వెలుగులో రోగులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

పెదబయలు, జూలై 15: మండలంలోని గోమంగి పంచాయతీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చీకటిలో మగ్గుతోంది. విద్యుత్ సరఫరా లేకపోవడంతో తరచూ సెల్‌ఫోన్ టార్చి వెలుగులో రోగులకు వైద్య సిబ్బంది సేవలందిస్తున్నారు. మండలంలోని గోమంగి, బొండాపల్లి, గుల్లెలు, బొంగరం, ఇంజరి పంచాయతీల్లో ప్రజలకు ఈ పీహెచ్‌సీ ద్వారా వైద్య సేవలు అందిస్తుంటారు. నెల రోజుల నుంచి పీహెచ్‌సీలో తరచూ విద్యుత్ ... మిగతా 8వ పేజీలో

కేజీహెచ్‌లో సేవలపై గరంగరం

రోజుకు కనీసం 10 వేల మందికి ఓపీ సేవలు అందాలి
ఎంపీ ఎం.శ్రీభరత్

- ఆస్పత్రి అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన
- కేజీహెచ్‌కు రావాలంటే రోగులు భయపడుతుంటారు: ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు
- హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలి
- వైద్యులు వ్యాపారాత్మక ఆలోచన వీడి సేవాభావంతో పని చేయాలని సూచించిన ఎమ్మెల్యే పల్లా
- ఆస్పత్రి అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చిన వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, తదితరులు ఉన్నారు

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రిగా పేరొందిన కేజీ హెచ్‌లో రోగులకు అందుతున్న సేవలు, మౌలిక సదుపాయాల పట్ల జిల్లాకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆంధ్ర మెడికల్ కళాశాలలోని సెమినార్ హాలులో వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులతో ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాట్లాడిన పలువురు ప్రజాప్రతినిధులు ఆస్పత్రి పనితీరు పట్ల అసహనాన్ని వ్యక్తం చేశారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన కేజీహెచ్‌లో ప్రతిరోజూ కనీసం పది వేల మందికిపైగా ఓపీ (అవుట్ పేషెంట్లు) సేవలు పొందాలని, కొన్నాళ్ల కిందటే ఏర్పాటు చేసిన ... మిగతా 8వ పేజీలో

అర్ధరాత్రి తీసుకొస్తే ఎలా?

- చిన్నారుల తల్లిదండ్రులపై డాక్టర్ కేకలు
- ఇద్దరు చిన్నారులకు వాంతులు, విరేచనాలు అవుతున్నాయని పీహెచ్‌సీకి తీసుకువెళ్లిన తల్లిదండ్రులు, బంధువులు
- వారితో డాక్టర్ దురుసు ప్రవర్తన
- తూతూమంత్రంగా వైద్యం చేసి పంపించారంటూ బాధితుల ఆరోపణ
- పిల్లలను భద్రాచలం ఆస్పత్రికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు



చికిత్స కోసం పిల్లలను తీసుకొచ్చిన బాధితులతో వాగ్వాదం చేస్తున్న వైద్యాధికారిణి సౌమ్య

సీలేరు, జూలై 15: తీవ్ర అస్వస్థతకు గురైన ఇద్దరు చిన్నారులను ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో సీలేరు 24 గంటల పీహెచ్‌సీకి తీసుకెళ్లిన తల్లిదండ్రులతో పీహెచ్‌సీ వైద్యురాలు వాగ్వాదానికి దిగారు. చిన్నారులకు వైద్యం చేయకుండా 30 నిమిషాలు దురుసుగా మాట్లాడారు. సీరియస్‌గా ఉందని ఈ సమయంలో తీసుకొచ్చామని తల్లిదండ్రులు, బంధువులు చెబుతున్నా డాక్టర్ వినలేదు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు అవాక్కయ్యారు. అరగంట తర్వాత తూతూమంత్రంగా వైద్యం చేసి, పంపించేశారు. దీనిపై బాధితులైన తల్లిదండ్రులు స్వామిరమణ, సుహాసిని తెలిపిన వివరాలిలా ఉన్నాయి.



చిన్నారులను భద్రాచలం ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్న తల్లిదండ్రులు స్వామిరమణ, సుహాసిని

గూడెంకొత్తవీధి మండలం సీలేరు 24 గంటల పీహెచ్‌సీకి ఇద్దరు చిన్నారులకు వాంతులు, విరేచనాలతో జ్వరం సోకి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స కోసం ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో సీలేరుకు చెందిన స్వామిరమణ, సుహాసిని దంపతులు, బంధువులు తీసుకెళ్లారు. ఇదరు కవల పిల్లలకు రెండు రోజులుగా విరోచనాలు అవుతుండడంతో జెన్‌కో ఆసుపత్రిలోను, ఒక ప్రైవేటు వైద్యాధికారి వద్ద చికిత్స చేయించారు. ఆదివారం రాత్రికి విరోచనాలు, వాంతులు తగ్గకపోవడంతో పాటు ఇద్దరికి జ్వరం సోకి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో సీలేరు పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ విధుల్లో ఉన్న స్టాఫ్‌నర్సు వెంటనే వైద్యాధికారిణి సౌమ్యకి ఫోన్ చేసి వాంతులు, విరోచనాలు, జ్వరంతో బాధపడుతున్న ఇద్దరు పిల్లలను తీసుకొచ్చారని చెప్పారు. వెంటనే డాక్టర్ బాధితులకు ఫోన్ ఇమ్మని చెప్పి అర్ధరాత్రి సమయంలో పిల్లల్ని ... మిగతా 8వ పేజీలో



దివ్యాంగుడి సమస్యను తెలుసుకుంటున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

అర్జీలకు సత్వర పరిష్కారం

జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరంలో మీకోసం నిర్వహణ

-వార్త 7వ పేజీలో...

బాలింతకు తప్పని డోలీ కష్టాలు

- గర్భిణికి పురిటినొప్పులని 108కు సమాచారం
- బహిర్భూమికి వెళితే ప్రసవం
- పండంటి మగ బిడ్డ జననం
- రోడ్డు బాగోలేక ఒకటిన్నర కిలోమీటర్ దూరంలో నిలిపేసిన 108 అంబులెన్స్
- కుర్చీని డోలీగా మార్చి జోరు వానలో తరలింపు
- బాలింత ఆరోగ్యం విషమంగా ఉందని కేజీహెచ్‌కు తరలింపు



బాలింత మైథిలికి డోలీలో ఆస్పత్రికి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

పెదబయలు, జూలై 15: మండలంలోని జామిగూడ పంచాయతీ పినరావల్లి గ్రామంలో హృదయ విదారక సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎం. మైథిలి అనే నిండు గర్భిణికి సోమవారం తెల్లవారుజామున పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్‌లో సమాచారం అందించారు. ఈ క్రమంలో ఉదయం 6 గంటల సమయంలో గ్రామ సమీపంలో ఉన్న తేలుగెడ్డ వద్ద మైథిలి బహిర్భూమికి సహయకులతో వెళ్లింది. అదే సమయంలో నొప్పులు అధికమై అక్కడికక్కడే పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు తల్లీబిడ్డలను ఇంటికి తీసుకెళ్లారు. ఆ సమయంలో 108 అంబులెన్స్ పినరావల్లి గ్రామానికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో గల చాకిరేవు జంక్షన్‌కు వచ్చింది. వర్షం కారణంగా రోడ్డు బురదగా మారిందని, గ్రామానికి వాహనం రాలేదని పైలెట్ చెప్పడంతో మైథిలి కుటుంబసభ్యులు ప్లాస్టిక్ కుర్చీకి కర్రలతో తాడు కట్టి డోలీలా తయారు చేసి జోరు వానలో బురద దారిలో మోసుకుంటూ తల్లీబిడ్డలను అంబులెన్స్ వద్దకు చేర్చారు. అక్కడి నుంచి 108లో ముంచంగిపుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ డాక్టర్ గీతాంజలి ఇద్దరిని పరిశీలించి, శిశువు ఆరోగ్యం బాగానే ఉంది కానీ తల్లి గర్భసంచి కిందకు జారడం వలన ఆమె పరిస్థితి విషమంగా ఉందని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి ఆమె పరిస్థితి మరింత విషమంగా ఉందని విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. పినరావల్లి గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం ఉండి ఉంటే తన భార్యకు ఈ పరిస్థితి వచ్చేది కాదని మైథిలి భర్త నాగేశ్వరరావు కన్నీటి పర్యంతం అయ్యారు.

చింతపల్లిలో ఆకాశవాణి కేంద్రం



- రూ.12.5 కోట్లతో రిలే స్టేషన్ నిర్మాణం
- వైసీటీ కొండపై 50 సెంట్లు స్థలం కేటాయింపు
- వచ్చే ఏడాదికి అందుబాటులోకి రేడియో సేవలు



నమూనా ట్రాన్స్‌మీటర్ టవర్ (ఫైల్)

చింతపల్లి, జూలై 15: మన్యం ప్రజలకు ఆకాశవాణి, ఎఫ్‌ఎం రేడియో ప్రసారాలు అందుబాటులోకి రానున్నాయి. ఆదివాసీ ప్రజలకు వినోదాన్ని పంచేందుకు ఆకాశవాణి (ఆల్ ఇండియా రేడియో) అధికారులు చింతపల్లి కేంద్రంగా రిలే స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ స్టేషన్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.12.5కోట్లను మంజూరు చేసింది. వచ్చే ఏడాదికి గిరిజన ప్రజలకు ఆకాశవాణి, ఎఫ్‌ఎం సేవలు అందుబాటులోకి రానున్నాయి. విశాఖపట్నంలోనున్న ప్రభుత్వ, ప్రైవేటు ఎఫ్‌ఎం స్టేషన్ల ఫ్రీక్వెన్సీ గిరిజన ప్రాంతానికి అందడం లేదు. ఈ నేపథ్యంలో గిరిజన ప్రాంత ప్రజలకు ఆకాశవాణి, ఎఫ్‌ఎం సేవలు ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి



మృతుడు సోమేశ్వరరావు (ఫైల్)

కశింకోట, జూలై 15 : మండలంలోని నర్సింగ బిల్లి - బయ్యవరం రైల్వేస్టేషన్ల మధ్యలో ఓ రైలు నుంచి జారి పడి యువకుడు మృతి చెందాడని తుని రైల్వే పోలీసుస్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. మృతుడు అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడి గ్రామానికి చెందిన అరేపు సోమేశ్వరరావు (25)గా గుర్తించామన్నారు. కాగా మృతుడు రాజమండ్రి నుంచి ఆదివారం రాత్రి అనకాపల్లికి రైలులో ప్రయాణం చేస్తూ జారిపడి మృతి చెందినట్టు తెలిసిందన్నారు. ఈ మేరకు మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

కడుపునొప్పి తాళలేక ఒకరి ఆత్మహత్యాయత్నం

అనకాపల్లి టౌన్, జూలై 15 : కడుపునొప్పి తాళ లేక ఓ వ్యక్తి కత్తితో గొంతు, చేతిని కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం తెల్లవారుజామున కోట్నీవీధిలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కోట్నీవీధికి చెందిన కె.శ్రీధర్ అనే వ్యక్తి కొంతకాలంగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నట్టు తెలిసింది. ఆ బాధను తట్టుకోలేక సోమవారం తెల్లవారుజామున కత్తితో గొంతును, ఎడమ చేతి మీద కోసుకుని కుప్పకూలిపోవడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. ఎన్టీఆర్ వైద్యాలయం, కేజీహెచ్ నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎస్.రాయవరం, జూలై 15: మండలంలోని నర్సీపట్నంరోడ్డు రైల్వే స్టేషన్‌లో సోమవారం రైలు పట్టాలు దాటుతున్న ఓ గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. దీనికి సంబంధించి తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ వివరాలు అందజేస్తూ సోమవారం నర్సీపట్నంరోడ్డు రైల్వే స్టేషన్‌లో ఒకటవ నంబరు ప్లాట్‌ఫారం దాటుతున్న సుమారు 40 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని తుని నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న రైలు ఢీకొట్టడంతో శరీరం నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు దొరకలేదని, మృతుడి ఎడమకాలికి స్టీల్ రాడ్ వేసి ఉందని తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచామన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి వివరాలు తెలిసినవారు తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రతించాలని ఆయన కోరారు.

ఆటో బోల్తా : అంగన్‌వాడీ కార్యకర్త మృతి



కళావతి(ఫైల్)

హుకుంపేట, జూలై 15: ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త కళావతి మృతి చెందిన ఘటన మండలంలో పాడేరు- అరకులోయ జాతీయ రహదారిపై గడుగుపల్లికి సమీపంలో సోమవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలో జొంకరంవలస గ్రామానికి చెందిన బి. మోహనరావు మరొకరి ఆటోను అద్దెకు తీసుకుని భార్య, అంగన్‌వాడీ కార్యకర్త కళావతి, చిన్న కుమార్తె, మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి పాడేరుకు బయలుదేరారు. పాడేరు-అరకులోయ జాతీయ రహదారిలో గడుగుపల్లి వద్దకు వచ్చేసరికి ఆటో అదుపుతప్పి రోడ్డుపైనే బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో అంగన్‌వాడీ కార్యకర్త కళావతి(35) తలకు బలమైన గాయమైంది. ఆమెను అంబులెన్సులో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించగా.. కళావతిని పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. అంగన్‌వాడీ కార్యకర్త మృతికి మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, వైఎస్ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, సీఐటీయూ మండల కార్యదర్శి అప్పలకొండపడాల్, తదితరులు సంతాపం తెలిపారు.

గాజువాకలో హత్య

- హతుడు మాజీ సైనికుడు
- నిందితులు లొంగుబాటు
- స్థల వివాదమే కారణం



హత్యకు గురైన అప్పలనాయుడు

గాజువాక, జూలై 15: గాజువాక జగ్గు జంక్షన్ సమీపంలో సోమవారం రాత్రి మాజీ సైనికుడు హత్యకు గురయ్యారు. స్థల వివాదమే ఇందుకు కారణంగా పోలీసులు చెబుతున్నారు. వివరాలిలా ఉన్నాయి. పాత కర్నవాని పాలేనికి చెందిన మాజీ సైనికుడు వేమిరెడ్డి అప్పలనాయుడు (48)ను అదే ప్రాంతవాసులు బంకా రాము, బంకా అశోక్‌లు కొబ్బరి బొండాల కత్తితో జగ్గు జంక్షన్ సమీపంలో గల శ్రీకృష్ణనగర్ రోడ్డులో అతి కిరాతకంగా నరికి చంపారు. అనంతరం నిందితులు గాజువాక పోలీసులకు లొంగిపోయారు. ఆర్మీలో పదవీ విరమణ అనంతరం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న అప్పలనాయుడుకు, రాము, అశోక్‌ల మధ్య చినగంట్యాడ ప్రాంతంలో ఉన్న 148 గజాల స్థలంపై కొద్దిరోజులుగా వివాదం నడుస్తుంది. ఈ నేపథ్యంలో రాము, అశోక్‌లు కలిసి అప్పలనాయుడును హతమార్చారు. సంఘటనా స్థలాన్ని డీసీపీ మోకా సత్తిబాబు, ఏసీపీ టి.త్రినాథ్, సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. కాగా మృతునికి భార్య కుమారుడు ఉన్నారు. స్థల వివాదమే హత్యకు కారణమని డీసీపీ మోకా సత్తిబాబు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులపై గతంలో స్టేషన్‌లో కేసులు ఉన్నాయని తెలిపారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

- జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్
- రంపచోడవరంలో మీకోసం నిర్వహణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రంపచోడవరం, జూలై 15: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అల్లూరి జిల్లా కలెక్టరు దినేశ్‌కుమార్ అన్నారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏజెన్సీ నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ముఖ్యంగా పోలవరం నిర్వాసితులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. మీ కోసం కార్యక్రమానికి కొత్త కలెక్టర్ రావడంతో అర్జీదారులు అధిక సంఖ్యలో సమస్యలను చెప్పుకునేందుకు గ్రీవెన్స్‌కు హాజరయ్యారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, గిరిజన సంక్షేమ ఇన్‌చార్జి డీడీ జాన్‌రాజ్, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డ్వామా పీడీ ఎం.శివయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	575
విజయనగరం	579
శ్రీకాకుళం	579

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

- అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



అర్జీదారునితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



పింఛన్ ఇప్పించాలంటూ కలెక్టరేట్‌కు వచ్చిన దివ్యాంగురాలు

తుమ్మపాల, జూలై 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి అందుతున్న అర్జీల పరిష్కార విషయంలో అధికారులు అలసత్వం వహించవద్దని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం శంకరం వద్ద గల కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. సుమారు 247 అర్జీలు అందినట్టు ఆమె తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళనలు

నక్కపల్లి మండలం డి.లక్ష్మీపురం గ్రామంలో పేదల సాగు భూములను వైజాగ్, చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ పేరుతో సర్వే నంబరు 85లో 110 ఎకరాలు దాదాపు 150 మంది పేదల నుంచి సేకరిస్తున్నారని, ఈ భూములకు నష్టపరిహారాన్ని చెల్లించాలని గ్రామస్థులు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పారావు సంఘం నాయకులతో కలిసి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అలాగే అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న మత్తు వ్యసన విముక్తి కేంద్రం ఉద్యోగుల జీత బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఉద్యోగులు కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని పాపయ్యపాలెం, సంతపాలెం, కొండుపాలెం గ్రామాల్లో గత ప్రభుత్వం చేపట్టిన ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు తక్షణమే న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలి

గత ఐదేళ్లుగా వృద్ధాప్య పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని నక్కపల్లిలో నివాసముంటున్న దివ్యాంగురాలు ఎద్దు అప్పలనర్స ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో ఆటోలో కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు.

వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు వద్దని ధర్నా



ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు

అనకాపల్లి టౌన్, జూలై 15 : వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలంటూ సోమవారం ఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయం ఎదుట రైతు సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ మునగపాక మండలంలో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్లు అత్యంత వేగంగా అమర్చుతున్నారన్నారు. మీటర్లు బిగించినప్పుడు రైతుల ఆమోదం లేకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగా రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. అనంతరం ఈపీడీసీఎల్ అధికారికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘాల నాయకులు గండి నాయనబాబు, రామ సదాశివరావు, బుద్ధ రంగారావు, సీఐటీయూ నాయకులు బ్రహ్మాజీ, బుజ్జి, తిమ్మరాజుపేట ఉపసర్పంచ్ భీశెట్టి రాము ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



జనసేన ఎమ్మెల్యేలకు సత్కారం

మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, సుందరపు విజయకుమార్, పంచకర్ల రమేశ్‌బాబులను జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సత్కరించారు.

ఆలిండియా టెన్నికాయిట్ టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా కేఎన్‌వీ



అభినందనలు అందుకుంటున్న కేఎన్‌వీ

అనకాపల్లి టౌన్, జూలై 15 : ఆలిండియా టెన్నికాయిట్ టెక్నికల్ కమిటీ చైర్మన్‌గా అనకాపల్లికి చెందిన కేఎన్‌వీ సత్యనారాయణ నియమితులయ్యారు. ఢిల్లీలో సోమవారం జరిగిన జాతీయ టెన్నికాయిట్ కార్యవర్గ సమావేశంలో ఈ నియామకం జరిగింది. 2024-28 వరకు నాలుగేళ్ల పాటు సత్యనారాయణ ఈ పదవిలో కొనసాగుతారు. ఆయన నియామకం పట్ల టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు, చైర్మన్ పీజీవీఆర్ నాయుడు, తవిటయ్య అభినందనలు తెలిపారు.

చేయి చేయి కలిపారు.. అక్విడెక్టు మరమ్మతు చేశారు

- మర్రివాడ చెక్‌డ్యామ్ రైతుల శ్రమదానం.. ▸ 15 ఆయిల్ డ్రమ్‌లతో ఏర్పాటు.. ▸ ఖరీఫ్‌కు సాగునీటి కొరత ఉండదని రైతుల ఆనందం



మర్రివాడ చెక్‌డ్యామ్ అక్విడెక్టుకు డ్రమ్‌లతో తయారు చేసిన కాలువను తీసుకువెళుతున్న రైతులు



ఏడాది క్రితం భారీ వర్షాలకు పిల్లర్ కూలిన దృశ్యం(ఫైల్‌ఫొటో)

కొయ్యూరు, జూలై 15: మండలంలో మర్రివాడ గైరమ్మ చెక్‌డ్యామ్ ప్రధాన అక్విడెక్టు కూలిపోవడంతో చెక్‌డ్యామ్ ఆయకట్టు రైతులు తాత్కాలికంగా మరమ్మతులు చేసుకుని సాగునీటిని పునరుద్ధరించుకున్నారు. 2023 జూలై 27న కురిసిన భారీ వర్షాలకు ఈ చెక్‌డ్యామ్ అక్విడెక్టు కూలిపోయింది. దీంతో గత ఏడాది ఖరీఫ్ ప్రశ్నార్థకంగా మారింది. బూదరాళ్ల కొండలపై నుంచి వచ్చే కొంగ వాగు నీరు మర్రివాడ సమీపంలో గైరమ్మ చెక్ డ్యామ్‌కు చేరుతుంది. ఇక్కడి నుంచి మర్రివాడకు చెందిన భూములతో పాటు దొడ్డవరం, చీడిపాలెం, కొయ్యూరు గ్రామాలకు చెందిన 1500 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. ఈ చెక్‌డ్యామ్ ద్వారా అందుతున్న నీటితో రైతులు ప్రతి ఏడాది రెండు పంటలు పండిస్తున్నారు. అయితే ఈ చెక్‌డ్యామ్ నుంచి సాగునీరు అందించే ప్రధాన కాలువకు మర్రివాడ నుంచి దొడ్డవరం గ్రామాల మధ్యలో నాలుగు ప్రాంతాలలో సిమెంట్ పిల్లర్లు వేసి అక్విడెక్టులను ఏర్పాటు చేశారు. వీటిలో ప్రధాన చెక్‌డ్యామ్‌కు అర కిలోమీటరు దూరంలో పొత్తూరు, తాళ్ల వారి పొలాలకు సమీపంలో ఏర్పాటు చేసిన అక్విడెక్టు పిల్లరు రెండేళ్ల క్రితం కుంగిపోగా రైతులు బలమైన కర్రలను దన్ను పెట్టారు. ఈ విషయాన్ని అప్పట్లో ఉన్నతాధికారులు, పాలకులకు రైతులు విన్నవించారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. గత ఏడాది జూలై నెలలో కురిసిన భారీ వర్షాలకు అక్విడెక్టు కూలిపోవడంతో చెక్‌డ్యామ్ ద్వారా సాగు భూములకు నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో గత ఖరీఫ్‌లో సాగు ప్రశ్నార్థకమైంది. దీంతో రైతులు అక్విడెక్టును పునరుద్ధరించేందుకు చేయి చేయి కలిపారు. సోమవారం 15 ఆయిల్‌డ్రమ్‌లను ఒకదానికి ఒకటి వెల్డింగ్ చేయించి, గ్రామస్థులు అతి కష్టం మీద మోసుకెళ్లి అక్విడెక్టు వద్ద అమర్చారు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగునీటికి ఢోకా ఉండదని రైతులు అంటున్నారు. అక్విడెక్టు పునః నిర్మాణానికి అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎస్ఎంఐ జేఈ రామకృష్ణ వద్ద ప్రస్తావించగా రైతుల వినతి మేర గత ఏడాదే పిల్లరు నిర్మాణాలకు రూ.6 లక్షలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. అనుమతులు వచ్చాయని, నిధులు విడుదల కాలేదన్నారు. అందువల్ల పనులు చేయలేకపోయామన్నారు.

సాగునీటి వనరులపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

- గ్రోయిన్లు, కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకోని వైనం
- ఖరీఫ్ వచ్చినా మారని పరిస్థితి
- వర్షాధారంపైనే ఈ ఏడాది వరి సాగు చేయాల్సి వస్తుందని రైతుల ఆవేదన
- కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న రైతులు



తూటిపాలలో నిరుపయోగంగా ఉన్న గ్రోయిన్

మాకవరపాలెం, జూలై 15: మండలంలో గత వైసీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్లు సాగునీటి వనరులు అధ్వానంగా తయారయ్యాయి. సాగునీటి కాలువలు, గ్రోయిన్లు మరమ్మతులు చేయకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. ఈ ఏడాది కూడా వర్షాధారం మీదే వరి సాగు చేయాల్సి ఉంటుందని అంటున్నారు. మండలంలో తూటిపాల గ్రామంలో గుడబాల గెడ్డలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. పది లక్షలతో గ్రోయిన్ ఏర్పాటు చేసి, సుమారు 400 ఎకరాలకు సాగునీరు అందించింది. అయితే తర్వాత వచ్చిన తుఫాన్ల వర్షాలకు గ్రోయిన్ పూర్తిగా దెబ్బతింది. దీంతో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంత రైతులు పలు మార్లు నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యేకి, అనకాపల్లి మాజీ ఎంపీకి వినతులు ఇచ్చారు. అయినా ఈ గ్రోయిన్ పరిస్థితి మాత్రం మారలేదు. దీంతో ఈ ఏడాది వరి సాగు చేయాలా? వద్దా? అనే మీమాంసలో రైతులు ఉన్నారు. ఇప్పటికే చాలామంది రైతులు 100 ఎకరాల్లో సరుగుడు తోటలు వేశారు. కూటమి ప్రభుత్వం ఈ గ్రోయిన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అలాగే మాకవరపాలెంలో సర్పానదికి ఆనుకొని ఉన్న మెరక కాలువ పూర్తిగా మట్టితో కప్పబడింది. ఈ కాలువ ద్వారా సుమారు 300 ఎకరాలకు సాగునీరు అందేది. అయితే ఐదేళ్లుగా ఈ సాగునీటి కాలువను పట్టించుకోకపోవడంతో సాగునీరు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కాలువను అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు.

బలిఘట్టంలో రాయవలస సినిమా షూటింగ్



హీరో,హీరోయిన్‌లపై క్లాప్ కొడుతున్న సూర్య బంగార్రాజు

నర్సీపట్నం, జూలై 15 : బలిఘట్టంలో రాయవలస కొత్త సినిమా షూటింగ్ సోమవారం ప్రారంభమైంది. బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయం పక్కన ఉన్న లక్ష్మీదేవి గుడిలో చిత్ర యూనిట్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయల్ రిసార్ట్స్ యజమాని గణపతిరాజు సూర్య బంగార్రాజు క్లాప్ కొట్టగా.. దర్శకురాలు రాధికా జయంతి హీరో హీరోయిన్‌లపై తొలి సన్నివేశాన్ని చిత్రకరించారు. రేసన్ ప్రొడక్షన్స్ బేనర్‌పై గోపికృష్ణ నిర్మాణ సారథ్యంలో కార్తీక్, శిరీషా హీరో హీరోయిన్‌లుగా గ్రామీణ నేపథ్యంలో రాయవలస సినిమా రూపొందిస్తున్నారు. అల్లు రామకృష్ణ(రాఖీ) సినిమాకి కథ, మాటలు అందించారు. నర్సీపట్నం పరిసర ప్రాంతాలలో 35 రోజులు పాటు సినిమా షూటింగ్ నిర్వహిస్తామని చిత్ర యూనిట్ తెలిపింది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్



ఫిర్యాదీతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్

తుమ్మపాల, జూలై 15 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ప్రతీ ఫిర్యాదును చట్టపరిధిలో విచారణ చేపట్టి పరిష్కరిస్తామని అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్ పేర్కొన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు ఫిర్యాదీలతో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన భర్త గోవింద్ కుమార్ నుంచి తనకు ప్రాణ హాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని వాడచీపురపల్లికి చెందిన వడ్డాది సుజి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా అంశాలకు సంబంధించి 39 ఫిర్యాదులు అందినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్రబాబు, ఎస్ఐ సావిత్రి పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై కలెక్టర్‌కి ఫిర్యాదు

అచ్యుతాపురం, జూలై 15: గత ప్రభుత్వంలో నిబంధనలను తుంగలో తొక్కిన అప్పటి అచ్యుతాపురం తహసీల్దార్ శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని పెదపాడు సర్పంచ్ జనపరెడ్డి అరుణ భర్త రమేశ్ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు.

జాతీయ తైక్వాండో టోర్నీలో కుందనశ్రీ ప్రతిభ



బంగారు పతకం సాధించిన కుందనశ్రీ

ఎలమంచిలి, జూలై 15: హైదరాబాద్‌లో ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో టోర్నీలో ఎలమంచిలి సెయింట్ జూడ్స్ స్కూల్‌కు చెందిన ఎం.కుందనశ్రీ బంగారు పతకం సాధించిందని ప్రిన్సిపాల్ రిక్కీరీడ్ తెలిపారు. ఆ విద్యార్థినిని, కోచ్ నగిరెడ్డి సత్యనారాయణను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

బుద్ధుని అవతారంలో జగన్నాథుడు



బుద్ధుని అవతారంలో జగన్నాథస్వామి

అనకాపల్లి టౌన్, జూలై 15: స్థానిక గూడ్స్‌షెడ్డు వద్ద గల ఇంద్రజ్యుమ్న హాల్‌లో కొలువై ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి సోమవారం భక్తులకు బుద్ధుని అవతారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు అధికసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చైర్మన్ దాడి బుజ్జి, ఈవో రాజసులోచన, కమిటీ సభ్యులు చర్యలు చేపట్టారు.

కృష్ణావతారంలో జగన్నాథస్వామి



కశింకోట, జూలై 15 : స్థానిక కోదండ రామస్వామి ఆలయంలో కొలువుదీరిన జగన్నాథస్వామి సోమవారం కృష్ణావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలోని జగన్నాథస్వామి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులకు ఆలయ అర్చకులు, వ్యవస్థాపకులు రేజేటి రామాచార్యులు (రాంబాబు), మారుతి విద్యాపీఠం వ్యవస్థాపకులు మారుతి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వాణిజ్య భవన సముదాయంపై వివాదం

అనకాపల్లి టౌన్, జూలై 15: అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరం మిర్యాల కాలనీలో మునిసిపాలిటీ స్థలంలో నిర్మిస్తున్న వాణిజ్య భవన నిర్మాణ వివాదం హైకోర్టుకు చేరుకుంది. హైకోర్టులో మే నెల 8వ తేదీన దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంలో ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాగూర్, జస్టిస్ రఘునందన్‌రావుల డివిజన్ బెంచ్ ఈ నెల 10వ తేదీన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వుల్లో 6వ పార్టీగా ఉన్న వైసీపీ యువజన విభాగం నాయకుడు పలకా రవిని ఆదేశిస్తూ ఈ ఆస్తిపై మూడవ పార్టీలకు ఎలాంటి ఆసక్తులు కల్పించరాదని ఆదేశాలిచ్చింది.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు గడువు పెంపు

పాడేరు రూరల్, జూలై 15: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యా అవార్డు-2024కు ఈ నెల 21వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులకు ఈ నెల 15వ తేదీకి గడువు ముగియగా, దరఖాస్తుల ఫైనల్ సబ్‌మిషన్‌ను ఈ నెల 21వ తేదీ సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపనట్టు చెప్పారు. ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, ఎయిడెడ్ యాజమాన్యాలలోని పాఠమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వెబ్‌సైట్‌లో ఉంచిన సూచనలు, అర్హతలు ప్రకారం దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

పీవో చొరవతో విద్యార్థికి శస్త్ర చికిత్స


స్థానిక ఆస్పత్రిలో సందీప్ (ఫైల్).. కేజీహెచ్‌లో చికిత్స

కొయ్యూరు, జూలై 15: తరచూ అపస్మారక స్థితికి చేరుకుంటూ అనారోగ్యానికి గురవుతున్న కొయ్యూరు గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి మోహన్ ప్రేమ్ సందీప్‌కు ఐటీడీఏ పీవో చొరవతో సోమవారం కేజీహెచ్‌లో శస్త్ర చికిత్స చేసినట్టు ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్ తెలిపారు. వారం రోజుల క్రితం సందీప్ ఉన్నట్టుండి పాఠశాలలో అపస్మారక స్థితికి వెళ్లాడని, హుటాహుటిన రాజేంద్రపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య సేవలు అందించారని, అనంతరం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారని చెప్పారు. అక్కడి వైద్యుల సూచనతో కేజీహెచ్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి మెదడు భాగంలో జన్యు సంబంధమైన ఇబ్బంది ఉన్నట్టు గుర్తించి శస్త్ర చికిత్స చేయాలని సూచించారన్నారు. దీనిపై ఐటీడీఏ పీవోకు సమాచారం ఇవ్వగా, తక్షణమే శస్త్ర చికిత్సకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించినట్టు ఆయన తెలిపారు. విషయాన్ని తల్లితండ్రులకు సమాచారం చేరవేసిన అనంతరం మోహన్ ప్రేమ్ సందీప్‌కు సోమవారం మధ్యాహ్నం కేజీహెచ్‌లో శస్త్ర చికిత్స చేసి జన్యుసంబంధమైన ఇబ్బందిని తొలగించినట్టు చెప్పారు. ప్రస్తుతం విద్యార్థి కోలుకుంటున్నాడని తెలిపారు.

గిరిజనులకు రైతు భరోసా అందించాలి

పాడేరురూరల్, జూలై 15: గిరిజన ప్రాంత రైతులకు భరోసా అందించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రస్తుతం వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతు భరోసా అందించాలని కోరారు. అలాగే అన్ని విత్తనాలను రాయితీపై అందించాలని కోరారు. అతని వెంట నాయకులు డి.బిమలమ్మ, సింహాచలం, చంటిబాబు, అమర్, రత్నం ఉన్నారు.

పోలవరం నిర్వాసితులకు పునరావాస కల్పన

- ప్యాకేజీ, పునరావాస అంశాలపై అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్ సమీక్ష

రంపచోడవరం, జూలై 15: 'పోలవరం' నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ చెప్పారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే, సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్, పోలవరం స్పెషల్ కలెక్టర్ సరళ వందనంతో కలిసి పోలవరం ప్రాజెక్టు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ అర్హులైన పోలవరం ముంపు బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలుకు గ్రామాల వారీగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ముంపు బాధితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. భూమికి భూమి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అంబేడ్కర్, మమ్మీ, తహశీల్దార్లు చలపతిరావు, సులోచన, డీటీలు కుమారి, కృష్ణశాస్త్రి, ప్రజ్ఞ, చిరంజీవి, త్రిమూర్తులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్....


కలెక్టర్‌ను ఎత్తుకుని గ్రామంలోకి తీసుకు వస్తున్న గిరిజనులు

రంపలో కలెక్టర్‌కు అపూర్వ స్వాగతం

అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ రంపచోడవరంలో అఖండ స్వాగతం లభించింది. సంప్రదాయ నృత్యాలతో గిరిజనం ప్రేమతో నూతన కలెక్టర్‌కు ఆహ్వానం పలికారు. భుజాలకెత్తుకుని అయనను కొద్దిదూరం తీసుకువచ్చారు. గతంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా పనిచేసిన ఆయన ఇక్కడి గిరిజనుల మన్ననలు పొందారు. ఇప్పుడు అల్లూరి జిల్లా కలెక్టర్‌గా తమ ప్రాంతానికి రావడంతో రంపచోడవరం ప్రారంభం నుంచి ఆయనను ఊరేగింపుగా గిరిజనులు తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు. అంతకు ముందు కలెక్టర్ రంపచోడవరం మండలం ఐ.పోలవరంలోని టీటీడీ వేంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు విజయ భాస్కర్, గిరిజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వీడని వర్షం... భయాందోళనలో గిరిజనం

- ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు
- గ్రామాలకు స్తంభించిపోతున్న రాకపోకలు
- ముంచంగిపుట్టులోని అడాలపుట్టులో పొంగుతున్న మత్స్యగెడ్డ పాయలు

ముంచంగిపుట్టు/అరకులోయ/గూడెంకొత్తవీధి/సీలేరు, జూలై 15: మన్యంలోని పలు మండలాల్లో వర్షం వీడడం లేదు. ఈ వర్షాలకు వాగులు, వంకలు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ముంచంగిపుట్టు మండలంలో 23 పంచాయతీల పరిధిలో వాగులు వంకలు, మత్స్యగెడ్డ పాయలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మత్స్యగెడ్డ ప్రవాహిత నీటిపై ఆధారపడి ఉన్న జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దోడిపుట్టు, లక్ష్మీపురం, బూసిపుట్టు, రంగబయలు తదితర పంచాయతీల పరిధిలో మత్స్యగెడ్డ పాయలు వరదనీటితో ప్రవహిస్తున్నాయి. లక్ష్మీపురం పంచాయతీ బిర్రుగూడ సమీపంలో మత్స్యగెడ్డ పాయతో పాటు దోడీపుట్టు పంచాయతీ అడాలపుట్టు గ్రామ సమీపంలో మత్స్యగెడ్డ పాయలపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 28 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. అలాగే అరకులోయలో వారం రోజులుగా భారీ వర్షం కురుస్తోంది. దీంతో పంట పొలాలన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. దీంతో పొలం పనుల్లో గిరి రైతులు నిమగ్నమయ్యారు. గూడెంకొత్తవీధి మండలంలోని పెబ్బెంపల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. సోమవారం పెబ్బెంపల్లి, అసాంపల్లి గిరిజనులు అతికష్టంపై వాగు దాటుకుని ఆర్‌వీ నగర్ సంతకు వచ్చారు. జిల్లా కలెక్టర్ స్పందించి పెబ్బెంపల్లి వాగులో వంతెన నిర్మించాలని ఆదివాసీలు కోరుతున్నారు.

అలాగే సీలేరు, అమ్మవారిధారకొండ పంచాయతీలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నడుంవీధి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ వాగుపై వంతెన లేకపోవడంతో గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి గ్రామాల గిరిజనులు ప్రాణాలకు తెగించి వాగు దాటి రాకపోకలు సాగిస్తున్నారు.



అరకులోయ: బల్లుగుడ-మాడగడ మధ్య లోయ ప్రాంతంలో వర్షం నీట మునిగిన పంట పొలాలు... ముంచంగిపుట్టు: అడాలపుట్టులో మత్స్యగెడ్డపై ప్రమాదకరంగా రాకపోలు


గూడెంకొత్తవీధి: ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును వ్యాన్‌లో ప్రమాదకరంగా దాటుతున్న గిరిజనులు

☛ సంక్షిప్తంగా..

చింతపల్లిలో ఫీవర్స్ సర్వే

చింతపల్లి, జూలై 15: మండల కేంద్రంలో ఫీవర్స్ సర్వే చేస్తున్నారు. సోమవారం ఆశ కార్యకర్తలు పలు వీధుల్లో గృహాలను సందర్శించి జ్వరాలతో బాధపడుతున్న వ్యక్తులకు రక్తపరీక్షలు చేశారు. ప్రస్తుతం గిరిజన ప్రాంతంలో ఎపిడమిక్ సీజన్ కావడంతో ఈ సర్వే చేస్తున్నారు. ఎక్కడైనా మలేరియా వ్యాధి నిర్ధారణ జరిగితే కుటుంబ సభ్యులందరికీ రక్త పరీక్షలు చేసి మందులు అందజేయనున్నట్టు వైద్యులు తెలిపారు. అలాగే దోమల నివారణ మందు కూడా పిచికారీ చేయనున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తూ గృహాల వద్దకే వైద్య సిబ్బందిని పంపించి రక్త పరీక్షలు నిర్వహించి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

971 ఎకరాల్లో ఉద్యానవన తోటలు

కొయ్యూరు, జూలై 15: మండలంలో 971 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు గుంతలు తీసే కార్యక్రమం ముమ్మరం చేశారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసే సదుద్దేశంతో ఉద్యాన మొక్కలు ఉచితంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మొక్కలు నాటేందుకు ఎంపిక చేసిన రైతుల భూములలో ఉపాధి హామీ పథకంలో గుంతలు తీయించే చర్యలు తీసుకున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 1500 మంది రైతులకు చెందిన రెండు వేల ఎకరాలలో జీడిమామిడి, కొబ్బరి, నిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, మామిడి, సపోట, జామ, తదితర 1,62,030 మొక్కలు సరఫరా చేయాలని నిర్ణయించారు. ఈ వారంలో గుంతలు తవ్వే కార్యక్రమం పూర్తవుతుందని, వచ్చే వారంలో మొక్కలు పంపిణీ చేస్తామని ఏపీవో రాజు తెలిపారు.

కూలీలకు 150 రోజుల పని దినాలు

చింతపల్లి, జూలై 15: ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు కలిగిన గిరిజన కూలీలకు ఉపాధి హామీ పథకంలో 150 రోజుల పనిదినాలు కల్పించాలని పీఎంయూ పీఐవో ఆర్.రామ్‌గోపాల్ ఎప్పారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో ఎన్ఆర్ఈజీఎస్ క్షేత్ర స్థాయి ఉద్యోగులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలందరికీ వంద రోజులు పని కల్పించాలన్నారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు కలిగిన వారికి 50 రోజులు అదనంగా పని ఇవ్వాలని సూచించారు. అలాగే ఉపాధి కూలీల ఆధార్ సీడింగ్ పూర్తిచేయాలన్నారు. బ్యాంక్ ఖాతాకు ఎన్‌పీసీఏ చేయించుకోవాలన్నారు. గతంలో బ్యాంక్ ఖాతాకు నగదు నేరుగా జమచేసేవారని, ప్రస్తుతం ఆధార్ ఆధారంగా ఎన్‌పీసీఏ చేయించుకున్న బ్యాంక్ ఖాతాకు నగదు జమ చేస్తున్నారని ఆయన తెలిపారు. ఆధార్ సీడింగ్, ఎన్‌పీసీఏ చేయించుకోకుంటే ఉపాధి కూలీలకు వేతనాలు అందవన్నారు. ఉపాధి కూలీలకు గరిష్ఠంగా రూ.300 కూలి చెల్లించడం జరుగుతుందని, ఈ కూలి పూర్తి స్థాయిలో అందే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీవో కె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

గూడెంకొత్తవీధి, జూలై 15: ఆదివాసీలు గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరావు సూచించారు. ఏబులం గ్రామంలో జరుగుతున్న దోమల మందు పిచికారీ, ఫీవర్స్ సర్వేను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి నిల్వల వల్ల కలిగే సమస్యలను వివరించారు. ప్రతీ కుటుంబం దోమల నివారణ మందును కచ్చితంగా పిచికారీ చేయించుకోవాలన్నారు. గృహ పరిసరాల్లో ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చు న్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా నైపుణ్యాలు అభివృద్ధి చేసుకోవాలి

పాడేరు రూరల్, జూలై 15: ప్రస్తుత టెక్నాలజీకి అనుగునంగా విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన వరల్డ్ యూత్ స్కిల్ డే వేడుకల్లో ఆయన మాట్లాడుతూ స్కిల్స్ డే ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థులు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి జి.ప్రశాంత్, వైస్ ప్రిన్సిపాల్ టీఎస్.రసూల్, అధ్యాపకులు మురళీధరరావు, రమేష్‌కుమార్, శంకరరావు, గౌరీశంకరరావు పాల్గొన్నారు.

లువ్వాసింగిలో ఇల్లు నేలమట్టం

జి.మాడుగుల, జూలై 15: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లువ్వాసింగి పంచాయతీ కేంద్రానికి చెందిన జర్రా సూరిబాబు ఇల్లు నేలకూలింది. సోమవారం కురిసిన భారీ వర్షానికి పెంకుటిల్లు నేలమట్టమైంది. పెంకులు సైతం ధ్వంసమయ్యాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే మధ్యాహ్నం వ్యవసాయ పనులకు వెళ్లిఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందిఇల్లు కూలిపోవడంతో నిరాశ్రులయ్యామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు.

సామూహిక వ్రతాలకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్, జూలై 15: మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్న సత్యనారాయణస్వామి సామూహిక వ్రతాలకు దరఖాసు చేసుకోవాలని బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు తెలిపారు. 108 మంది దంపతులతో నిర్వహించే సత్యనారాయణ వ్రత కల్పనలో పాల్గొనదలచిన వారు ముందుగా టీటీడీ కల్యాణ మండపంలోని బ్రహ్మకుమారీస్ ఆశ్రమంలో పేర్లు నమోదు చేసుకొని సీరియల్ నంబరు పొందాలని సూచించారు. మోదకొండమ్మ ఆలయంలో ఆ రోజు సాయంత్రం 4 గంటల నుంచి సామూహిక వ్రతాలను నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తి గల దంపతులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

ఏకలవ్య విద్యాలయాల్లో ప్రతిభావంతులనే నియమించాలి

పాడేరు రూరల్, జూలై 15: ఏకలవ్య విద్యాలయాల్లో ప్రభుత్వం నియమించిన ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులనే కొనసాగించాలని జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.చిట్టిబాబు, కె.రమేష్ కోరారు. ఈ విద్యాలయాల్లో స్థానికులనే అధ్యాపకులుగా నియమించాలంటూ వివిధ సంఘాలు చేస్తున్న ప్రకటనలను ఖండిస్తున్నట్టు చెప్పారు. మెరిట్ ఆధారంగా ప్రభుత్వం బోధనా సిబ్బందిని నియమిస్తే, వారిని తొలగించి స్థానికులను నియమించాలని కోరడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు పి.తిరుపతిరావు, పి.సన్యాసి నాయుడు, జల్లి శ్రీను, బాలరాజు పాల్గొన్నారు.

అర్ధరాత్రి తీసుకొస్తే ఎలా?

... 5వ పేజీ తరువాయి

తీసుకురావడం ఏమిటని ప్రశ్నిస్తూ.. కేకలు వేశారు. దీంతో అర్ధరాత్రి సమయంలో సీరియస్‌గా ఉంది కాబట్టి ఆసుపత్రికి రావలసి వచ్చిందని, మీరు రాకపోతే పీవో గారికి ఫిర్యాదు చేస్తామంటూ చెప్పి ఫోన్‌ను స్టాఫ్ నర్సుకు ఇచ్చేశారు. అనంతరం అరగంట తర్వాత పీహెచ్‌సీకి వచ్చిన వైద్యాధికారిణి వచ్చీరాగానే ముందుగా పిల్లలకు వైద్య సేవలను అందించకుండా బాధితులతో అరగంట పాటు వాగ్వాదానికి దిగారు. పీవోకు నాపై ఫిర్యాదు చేసినా నాకు ఏమీ భయం లేదంటూ కేకలు వేశారు. తీవ్ర అస్వస్థతతో ఉన్న చిన్నారులకు వైద్య సేవలు అందించాల్సిన వైద్యాధికారిణి అర్ధరాత్రి సమయంలో ఎందుకు వచ్చారని ప్రశ్నించడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీలేరు పీహెచ్‌సీలో 24 గంటలు వైద్య సేవను అందించాల్సి ఉండగా అత్యవసర సమయాల్లో చికిత్స కోసం వెళితే పిల్లలకు తూతూ మంత్రంగా వైద్య సేవలను అందించి.. చిన్నపిల్లల నిపుణుల దగ్గర చూపించుకోండి అంటూ వైద్యాధికారిణి చేతులు దులుపుకున్నారని బాధితులు తెలిపారు. దీంతో భయపడిన తల్లిదండ్రులు చిన్నారులను రాత్రికి రాత్రే భద్రచలం ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిస్తున్నారు. అత్యవసర సమయంలో చికిత్స కోసం పీహెచ్‌సీకి వెళితే ముందుగా పిల్లలకు వైద్యం చేయకుండా వాగ్వాదానికి దిగిన వైద్యాధికారిణిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు, వారి బంధువులు కోరుతున్నారు.

వైద్యాధికారిణి వివరణ

ఆదివారం రాత్రి వాంతులు, విరోచనాలు, జ్వరంతో పీహెచ్‌సీకి తీసుకొచ్చిన పిల్లల తల్లిదండ్రులతో దురుసుగా మాట్లాడలేదని సీలేరు పీహెచ్‌సీ డాక్టర్ సౌమ్య చెప్పారు. పిల్లలకు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న మలేరియా పరీక్షలను చేసి, మెరుగైన వైద్య సేవల కోసం చిన్నపిల్లల నిపుణుల వద్దకు తీసుకెళ్లాలని సిఫార్స్ చేశామన్నారు. ఏ సమయంలోనైనా వైద్య సేవలను అందిస్తామని సౌమ్య వివరణ ఇచ్చారు.

సెల్‌ఫోన్ టార్చి వెలుగులో వైద్య సేవలు

... 5వ పేజీ తరువాయి

సరఫరా ఉండకపోవడంతో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఎపిడమిక్ సీజన్ కావడంతో సోమవారం రాత్రి ఐదుగురు రోగులు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో పీహెచ్‌సీలో చేరారు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో వారికి సెల్‌ఫోన్‌ల కాంతితో వైద్య సిబ్బంది సేవలను అందించారు. తమ ప్రాంతానికి ఉన్న ఏకైక ఆస్పత్రిలో ఇలా విద్యుత్ సమస్య వెంటాడుతుండడంతో రోగుల కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. ఈ విషయాన్ని పీహెచ్‌సీ సిబ్బంది వద్ద ప్రస్తావించగా.. విద్యుత్ సమస్యపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా నిమ్మకు నీరెత్తనట్టు వ్యవహరిస్తున్నారని వాపోయారు. విద్యుత్ సరఫరా లేకపోవడం వల్ల ఫ్రిజ్‌లో ఉన్న విలువైన మందులు పాడవుతున్నాయని వారంటున్నారు. ఇప్పటికైనా ఏపీఈపీడీసీఎల్ అధికారులు స్పందించి గోమంగి పీహెచ్‌సీకి నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

చింతపల్లిలో ఆకాశవాణి కేంద్రం

... 5వ పేజీ తరువాయి

అందించేందుకు ఆల్ ఇండియా రేడియో ముందుకొచ్చింది.

75మీటర్ల ఎత్తులో ట్రాన్స్‌మీటర్ టవర్

చింతపల్లి, విజయనగరంల్లో ఆల్ ఇండియా రేడియో రిలే టవర్లు మంజూరు చేసింది. చింతపల్లి వైటీసీ భవనం వెనుక కొండపైన 50సెంట్లు స్థలాన్ని రెవెన్యూ కేటాయించారు. ఈ స్థలంలో 75 మీటర్ల ఎత్తులో రిలే కేంద్రం వద్ద ట్రాన్స్‌మీటర్ టవర్‌ని నిర్మించనున్నారు. ఈ రిలే కేంద్రం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.12.5కోట్లు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించేందుకు ఆకాశవాణి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చింతపల్లిలో ఐదు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌మీటర్ టవర్ నిర్మాణం జరుగనున్నది. ఈ రిలే కేంద్రం ద్వారా విశాఖపట్నం ఆకాశవాణి ఎఫ్ఎం ప్రసారాలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి. ట్రాన్స్‌మీటర్ టవర్ నిర్మాణం పూర్తికాగానే ఆకాశవాణి, ఎఫ్ఎం సేవలు అందుబాటులోకి వస్తాయి.

ఆకాశవాణికి స్థలం అప్పగింత

-టి.రామకృష్ణ, తహసీల్దార్



చింతపల్లి మండల కేంద్రంలో 50 సెంట్లు స్థలాన్ని ఆకాశవాణి అధికారులకు అప్పగించాం. తాజాగా ఆకాశవాణికి కేటాయించిన స్థలం సర్వే పూర్తి చేశాం. ఆకాశావాణి రిలే కేంద్రానికి వైటీసీ భవనం వెనుక ఎత్తైన కొండ అత్యంత అనువైంది.



ఏడాదిలో నిర్మాణాలు పూర్తి

-సి.సుబ్బారావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్, ఆకాశవాణి

చింతపల్లిలో ఏడాది కాలంలో ఆకాశవాణి రిలే కేంద్రం నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా చేసుకున్నాం. ఈ పనులు సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తాం. విశాఖపట్నంలో ఆకాశవాణి ప్రసార కేంద్రం ఉన్నప్పటికీ ఫ్రీక్వెన్సీ తక్కువగా ఉండడం వల్ల గిరిజన ప్రాంత ప్రజలకు సేవలు అందుబాటులోకి రాలేదు. రిలే స్టేషన్ అందుబాటులోకి వస్తే గిరిజన గ్రామాలన్నింటికి ఆకాశవాణి సేవలు స్పష్టంగా అందుబాటులోకి వస్తాయి.

ఎంపీటీసీ సభ్యురాలు కుటుంబాన్ని ఆదుకుంటాం

- మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): హుకుంపేట ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మా రమా కుటుంబాన్ని ఆదుకుంటామని తెలుగుదేశం పార్టీ అరకులోయ పార్లమెంట్ ఇన్‌చార్జి, మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు రమా భర్త, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ సింహాచలం అలియాస్ కొమ్మా బాబు(42) అనారోగ్యంతో సోమవారం మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన జిల్లా ఆస్పత్రికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. అందరితో ఎంతో సౌమ్యంగా ఉండే సింహాచలం తనకు కుటుంబ సభ్యుడితో సమానమని, ఆయన లేని తీర్చలేదని ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ అన్నారు. అలాగే ఎంపీటీ సీ సభ్యురాలు రమా కుటుంబానికి సంపూర్ణ అండగా ఉంటామన్నారు. ధైర్యంగా ఉండాలని రమా, కుటుంబ సభ్యులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాండురంగస్వామి, అచ్చిబాబు, మహేశ్, త్రినాథ్, తదితరులు పాల్గొన్నారు.


పాడేరు ఆస్పత్రిలో రమాను పరామర్శిస్తున్న శ్రావణ్‌కుమార్, నాయకులు

వంగసారలో దోమల మందు పిచికారీ


పిచికారీని పరిశీలిస్తున్న ఎంపీడీవో వీరసాయిబాబు

చింతపల్లి, జూలై 15: మండలంలోని వంగసార గ్రామంలో సోమవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏఎంవో సత్యనారాయణతో కలిసిఎంపీడీవో వీరసాయిబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మందు వాసన ఉండదని, కేవలం దోమలపై మాత్రమే ప్రభావం చూపుతుందని చెప్పారు. గృహం లోపల, బయట పిచికారీ చేయిస్తే దోమలు చనిపోతాయన్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, మలేరియా సిబ్బంది చిట్టిబాబు, యుగంధర్ పాల్గొన్నారు.

1912కు ఫోన్ చేస్తే వ్యవసాయ విద్యుత్ కనెక్షన్

- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం, జూలై 15: వ్యవసాయానికి కొత్త విద్యుత్ కనెక్షన్ కావలసిన వారు టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేసి సర్వీస్ పొందవచ్చునని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల పరిధిలోని వినియోగదారులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ కోసం 1912కు ఫోన్ చేసి కనెక్షన్ పొందవచ్చునని పేర్కొన్నారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలోని మీసేవా కేంద్రాల, గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్ల అప్లికేషన్‌లు అప్‌లోడు చేసేటప్పుడు ఎదురవుతున్న సమస్యలను దృష్టిలో పెట్టుకుని టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయడం ద్వారా విద్యుత్ కనెక్షన్ పొందే నూతన రిజిస్ట్రేషన్ విధానాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. 1912 నంబరు ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయడానికి ఫోన్ చేసే సమయంలో రైతులు తమ ఆధార్ నంబరు, రిజిస్టర్డ్ మొబైల్ నంబరు, పట్టాదారు పాస్‌బుక్ నంబరు, సర్వే నంబరు, వాల్టా సర్టిఫికెట్ నంబరు, కుల ధ్రువీకరణ పత్రం నంబరు తదితర వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కేజీహెచ్‌లో సేవలపై గరంగరం

... 5వ పేజీ తరువాయి

గీతంలో ఐదు వేల మందికిపైగా ఓపీ సేవలు పొందుతున్నారన్నారు. ఐదు, పదేళ్ల ప్రణాళి కలతో అభివృద్ధి పనులు చేయవద్దని, రానున్న 50 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని రూ.200-300 కోట్లతో భారీగా భవన నిర్మాణాలను చేప ట్టాలని సూచించారు. నిధులు గురించి బెంగ వద్దని, అందుకు అనుగుణమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. కేజీహెచ్ పట్ల ప్రజల్లో మంచి భావన ఉండేదని, అది క్రమంగా తగ్గుతోందని, దాన్ని మళ్లీ పెంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మంచి రోజులు వచ్చాయని, మంచి నాయకత్వంతో ముందుకు వెళుతున్నామన్నారు. ఆస్పత్రి అవసరాలను చెప్పాలని, వాటిని తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు పరిశోధనలు సాగించడం ద్వారా ప్రివెంటివ్ మెథడ్స్‌పై దృష్టిసారించాలని శ్రీభరత్ సూచించారు. కేజీహెచ్‌తో పాటు జిల్లా అంతటా ఫాగింగ్ చేయించడంపై దృష్టిసారించాలని ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు.

ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ కేజీహెచ్‌లో నిపుణులైన వైద్యులు, వందలాది మంది సిబ్బంది ఉన్నప్పటికీ ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన దుస్థితి నిరుపేద రోగులకు ఏర్పడుతోందన్నారు. కేజీహెచ్‌కు రావాలంటే ఇప్పటికీ రోగులు భయపడుతుంటారని, మెరుగైన సేవలు అందవన్న భయం రోగుల్లో ఉందన్నారు. నర్సింగ్ స్టాఫ్ కొరత ఎప్పటి నుంచో వేధిస్తోందని, దీనివల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రి అవసరాలకు తగ్గ సిబ్బంది లేరన్నారు. ప్రతి రోగికి మెరుగైన సేవలు అందించేలా ఆస్పత్రిని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేయాలని, అవి తీసుకొచ్చే బాధ్యతను తాము తీసుకుంటామన్నారు. ఆస్పత్రిలో రోగులకు సహకారాన్ని అందించేలా హెల్ప్ డెస్కులు ఏర్పాటుచేయాలని విష్ణుకుమార్‌రాజు సూచించారు. రోగుల పట్లతో ప్రేమతో వ్యవహరించాలన్నారు. ఇక్కడకు వస్తే మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న భావన ప్రజల్లో కలగాలన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేజీహెచ్‌లో సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యులు కూడా రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు శాయశక్తులా కృషిచేయాలని సూచించారు. వైద్య వృత్తిలో డబ్బు సంపాదించాలన్న ఆలోచన సరికాదని, వ్యాపారులు మాత్రమే డబ్బు సంపాదిస్తారని, ఇందులో సేవాగుణం మాత్రమే ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందిస్తాం: మంత్రి సత్యకుమార్

వందేళ్ల చరిత్ర కలిగిన ఏఎంసీ నుంచి వేలాది మంది వైద్యులుగా బయటకు వెళ్లి దేశ, విదేశాల్లో స్థిరపడ్డారని వారంతా ఆస్పత్రి అభివృద్ధికి సహకారాన్ని అందించాలని మంత్రి సత్యకుమార్ కోరారు. దాతల సహకారంతో విభాగాలకు అవసరమైన పరికరాలు కొనుగోలు చేయాలన్నారు. ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల వైపు చూసే రోజులు పోవాలని, ప్రభుత్వ ఆస్పత్రులు వైపు వచ్చేలా చేయాల్సిన బాధ్యత వైద్యులపై ఉందన్నారు. ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, సిబ్బంది కొరత, ఇతర సమస్యలపై దృష్టిసారించి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వం తరఫున ఆస్పత్రి అభివృద్ధికి సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని స్పష్టంచేశారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలకు మ్యాచింగ్ గ్రాంటుకు నిధులను సమీకరిస్తున్నట్టు తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు చెప్పిన సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రిని ఆస్పత్రి అధికారులు, సిబ్బంది సత్కరించారు. పలువురు సమస్యలపై మంత్రికి వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ నాయకులు పీలా గోవింద్ సత్యనారాయణ, గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జగదీశ్వరరావు, ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు, ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్, కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ లోకనాథం, డాక్టర్ గోపి, డాక్టర్ గిరినాథ్, డాక్టర్ సుబ్రహ్మణ్యంతోపాటు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.